క్లుప్తంగా

బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



జడ్చర్ల: స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, కౌన్సిలర్లు రమేష్, రఘు, చైతన్య, మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, ప్రణీల్‌చందర్, ఇమ్ము, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు



కోయిల్‌కొండ: ప్రజలు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని వారికి పోలీసుశాఖ రక్షణ ఉంటుందని అడిషనల్ ఎస్పీ సురేష్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఓటు హక్కుపై ప్రజలకు భరోసా కల్పిస్తూ కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఎస్ఐ రాఘవేందర్, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

భూత్పూర్: తాటికొండకి చెందిన అంజమ్మ అదృశ్యమైనట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు సదరు మహిళ ఈనెల 18న తల్లి గారి గ్రామానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. కాగా రెండు రోజుల తరువాత ఫోన్ చేయగా ఆమె అక్కడికి వెళ్లలేదని తెలిసింది. దీంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికినా ఫలితం కనిపించలేదు. గతంలోనూ అంజమ్మ ఇలాగే వెళ్లి తిరిగి వచ్చేదని ఆమె భర్త తెలిపారు. ఈ మేరకు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ప్రచారం

నవాబుపేట: మండలంలో ఆదివారం బీజేపీ అభ్యర్థి డీకే అరుణ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు బాలు, యాదయ్య, శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కొల్లూర్ కార్నర్ మీటింగ్‌లో ఆమె పాల్గొంటారని.. అనంతరం మండల కేంద్రంలో మీటింగ్‌లో ప్రసంగిస్తారని వివరించారు.

యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కేంద్రంలో బీజేపీ అధికారం ఉన్న ఈ పదేళ్ల కాలంలో కార్మిక చట్టాలను యాజమాన్యానికి అనుకూలంగా మార్చారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి ఆరోపించారు. శనివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో 'మతోన్మాద బీజేపీని ఓడించండి' బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్స్‌గా తెచ్చి కార్మిక హక్కులను హరించారని విమర్శించారు. రోజుకు కనీస వేతనం కేవలం రూ.178 మాత్రమే ఉండాలని నిర్ణయించారని, ఇది ముమ్మాటికీ కార్మికవర్గాన్ని అన్యాయం చేయడమేనని పేర్కొన్నారు. దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టి, కార్మికవర్గానికి కన్నీళ్లు మిగిల్చారని వాపోయారు. పీఎఫ్‌ను సైతం షేర్ మార్కెట్‌లో పెట్టడం తగదని, 8 గంటల పనిని 12 గంటలకు పెంచి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికే అమలు చేస్తున్నారన్నారు. పారిశ్రామిక అధిపతులకు కేంద్ర ప్రభుత్వం వంత పాడుతోందని, ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ప్రజలు ఓడించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కిల్లె గోపాల్, రాజ్‌కుమార్, ముక్తార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగార్థుల సమస్యలను పరిష్కరిస్తాం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉద్యోగార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తప్పక పరిష్కరిస్తామని పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇక్కడ వివిధ పోటీ పరీక్షల కోసం సిద్ధమవుతున్న విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే మే 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తామన్నారు. ఇప్పటికే టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేశామని, న్యాయపరమైన సమస్యలు లేకుండా ఉద్యోగాల కల్పన చేస్తామన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో అధిక సంఖ్యలో ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. 'మీ కష్టం వెనుక మీ తల్లిదండ్రుల ఆశ ఉంది..' అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, కాంగ్రెస్ నాయకులు ఏపీ మిథున్‌రెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈసారీ కష్టాలు తప్పవా?



వాగులో అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణం

- అసంపూర్తిగా హైలెవల్ బ్రిడ్జి
- ఏడాదిగా నిలిచిన పనులు
- వాగు వద్ద ఒకవైపు తలెత్తిన భూ సమస్య

అడ్డాకుల: మండలంలోని వర్నె వద్ద వాగులో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పనులు ఏడాదిగా నిలిచిపోయాయి. బ్రిడ్జి నిర్మాణం చేసే చోట వాగుకు ఒకవైపు భూ సేకరణ సమస్య తలెత్తడంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో వర్షాకాలంలో రాకపోకలకు మళ్లీ తీవ్ర ఇబ్బందులు కలగనున్నాయి. గడిచిన రెండేళ్లలో వాగు దాటుతూ ఇద్దరు వ్యక్తులు గల్లంతైన నేపథ్యంలో ఈసారి కూడా వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోనున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ.18కోట్లతో పనులు మొదలైనా..!

వర్నె వద్ద వాగులో వంతెన లేకపోవడంతో వర్నెతో పాటు ముత్యాలంపల్లి, పేరూరు, కురుమూర్తి, వెంకంపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈనేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో రోడ్లు, భవనాలశాఖ ద్వారా రూ.18కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రూ.9కోట్లు వాగులో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి కేటాయించారు. మిగతా రూ.9కోట్లతో జాతీయ



గతేడాది వర్షాకాలంలో వాగులో కొట్టుకుపోయిన దారి (ఫైల్)

రహదారి నుంచి బలీదుపల్లి మీదుగా కన్మనూర్ క్రాసింగ్ వరకు ఇప్పుడున్న బీటీరోడ్డును డబుల్ లైన్‌గా మార్చనున్నారు. దీంతో పాటు కన్మనూర్ క్రాసింగ్ నుంచి వాగు వరకు కొత్తగా సింగిల్ లైన్ బీటీరోడ్డు నిర్మాణం చేయనున్నారు. ఇదిలా ఉండగా బ్రిడ్జి నిర్మాణం కోసం కేటాయించిన నిధుల్లోనే బలీదుపల్లి, కన్మనూర్ క్రాసింగ్, సోలార్ వద్ద మూడు కల్వర్టులను నిర్మించనున్నారు. ఈ పనులకు 2022 జూన్ 6న అప్పటి మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి అప్పటి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.

ఆలస్యంగా మొదలై..మధ్యలోనే నిలిచి..!

2022 జూన్‌లో పనులకు శంకుస్థాపన చేసినా మొదట్లోనే పనులు ఆరు నెలలు ఆలస్యంగా మొదలయ్యాయి. ప్రస్తుతం ఉన్న దారిపైనే బ్రిడ్జి నిర్మాణం చేయించడానికి వీలు లేకపోవడం వల్ల కొత్త దారిలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం వాగులో ఉన్న దారి క్రాస్‌గా ఉంది. ఇదే తరహాలో వాగులో బ్రిడ్జి నిర్మాణం చేయించడానికి ఆ శాఖ ఉన్నతాధికారులు సుముఖత వ్యక్తం చేయలేదు. దీంతో పలుమార్లు ఉన్నతాధికారులు చర్చించి డ్రాయింగ్ ఫైనల్ చేయడానికి కొంత ఆలస్యం జరిగింది. చివరికి వాగులో స్ట్రేయిట్‌గా కొత్త దారిలో బ్రిడ్జి నిర్మాణం చేయాలని నిర్ణయించారు. పనులు మొదలై సగం పూర్తి కాగానే మధ్యలోనే నిలిచిపోయాయి. ఒకవైపు వాగు గడ్డపై భూమిని సేకరించే ప్రక్రియ అడ్డురావడంతో ఆగిపోయాయి. భూసేకరణ సమస్య కొలిక్కి రాకపోవడంతో ఏడాదిగా మొదలు కావడం లేదు. ఈనేపథ్యంలో ఈసారి వర్షాకాలంలో ప్రజలకు మళ్లీ కష్టాలు తప్పేలా లేవు.

నిలిచిన పనులపై ఎమ్మెల్యే ఫోకస్

కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నికైన జి.మధుసూదన్‌రెడ్డి బ్రిడ్జి నిర్మాణం పనులు నిలిచిపోవడంపై ఫోకస్ చేశారు. సంబంధిత శాఖ అధికారులతో ఇటీవల సమీక్ష జరిపారు. వాగులో బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తవడానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణ సమస్య కూడా త్వరగా పూర్తి చేసి పనులు మొదలు పెట్టించే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. భూ సమస్యపై రెవెన్యూ అధికారులతో మాట్లాడి సూచనలు చేశారు.

త్వరగా పూర్తి చేయించాలి



మా ఊరి వద్ద వాగులో నిర్మాణం చేపట్టిన బ్రిడ్జి పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఏడాది నుంచి పనులు చేయడం లేదు. వర్షాకాలంలో వాగొస్తే మళ్లీ దారి కొట్టుకుపోయి కష్టాలను ఎదుర్కొవాల్సి వస్తుంది. త్వరగా బ్రిడ్జి పనులు పూర్తి చేయించాలి.

-వినోద్‌ౌట్టి, వర్నె

భూత్పూర్‌లో కేసీఆర్‌కు ఘనస్వాగతం



పూలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

భూత్పూర్: బస్సుయాత్రలో భాగంగా శనివారం సాయంత్రం మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు చౌరస్తాలో, మండలంలోని ఎల్కిచర్ల సమీపంలోని ఏవీఆర్ కాలనీ వద్ద బీఆర్ఎస్ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. పాలకొండలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఫాంహౌస్ నుంచి నాగర్‌కర్నూల్‌కు బస్సులో వెళ్తుండగా భూత్పూర్ చౌరస్తాలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, మాజీఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, మురళీధర్ గౌడ్, మైనార్టీ నేత మహ్మద్ సాదిక్, సత్యనారాయణ, యాసీన్, కౌన్సిలర్లు, నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. బ్రిడ్జి పై నుంచి కేసీఆర్‌పై పూల వర్షం కురిపించారు. కేసీఆర్..కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు.

నెక్కొండలో సామూహిక హోమాలు



జడ్చర్ల టౌన్: మండలంలోని నెక్కొండలో జరుగుతున్న ఇంద్రస్థాపన మూర్తి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా శనివారం సామూహిక హోమాలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణాల మధ్య కార్యక్రమం నిర్వహించారు. సర్వతోభద్ర, నవగ్రహ, వాస్తు, క్షేత్రపాల, యోగిని మంటప ఆరాధనలు, 108కలశాలతో పంచామృతాభిషేకాలు, ధాన్య, ఫల, పుష్పాధివాసములు చేశారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, కుంభం, దీనుదర్శన పూర్ణాహుతి ప్రథమారాధన కార్యక్రమాలు చేయనున్నారు.

బీజేపీకి బ్రహ్మరథం పడుతున్నారు



మాట్లాడుతున్న రాములు

పాలమూరు: కాంగ్రెస్ నేతలు డీకే అరుణ రాజకీయ ప్రస్థానం గురించి మాట్లాడే ముందు రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రయాణం ఎక్కడి నుంచి మొదలు అయ్యిందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందని బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కె.రాములు అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీకే అరుణపై రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఓబెదుల్లా కోత్వాల్ మాట్లాడిన తీరు పూర్తిగా ఆక్షేపణీయమన్నారు. ఉమ్మడి జిల్లా ప్రాజెక్టుల సాధన కోసం హైదరాబాద్ వరకు డీకే అరుణ పాద యాత్ర చేసిన విషయాన్ని మరిచిపోయారా అంటూ ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి కల్వకుర్తి నుంచి కొడంగల్ నియోజకవర్గానికి వలస వచ్చి ఇప్పటి వరకు అభివృద్ధి చేయలేకపోయాడన్నారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారంటీలకు దిక్కు లేదని, ఆయన పూర్తిగా అభద్రతా భావంలో ఉన్నాడని తెలిపారు. మైనార్టీలను బీజేపీ వేధిస్తోందని వారిలో అభద్రతా భావాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితుల్లో మైనార్టీలు ఏమాత్రం లేరన్నారు. ఇప్పటికే పాలమూరులో తాగునీటి సంక్షోభం ప్రారంభం అయ్యిందని, దీనిపై దృష్టి పెట్టాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కల్లబొల్లి మాటలను విశ్వసించే పరిస్థితుల్లో ప్రజలు ఏమాత్రం లేరని.. క్షేత్రస్థాయిలో డీకే అరుణకు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌కుమార్, సత్యం, క్రిష్ణవర్ధన్‌రెడ్డి, గోపాల్, అంజయ్య, రామాంజనేయులు, వీరయ్య, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

అడ్డాకుల: మండలంలోని గుడిబండ స్టేజీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. గుడిబండకు చెందిన వెంకటస్వామి, వనపర్తికి చెందిన రవిలు ద్విచక్రవాహనంపై శుక్రవారం సాయంత్రం టోల్‌ప్లాజా వైపు జాతీయ రహదారిపై వెళ్తున్నారు. అదే సమయంలో కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి గాయాలు కాగా వారికి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. కాగా శనివారం వెంకటస్వామి బావ కురుమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



భూత్పూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శనివారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. భూత్పూర్ పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలల్లో ఆయా గ్రామాలకు చెందిన బూత్ స్థాయి అధ్యక్షులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై ఈ సందర్భంగా కరపత్రాలతో ఇంటింటికి ప్రచారం చేస్తున్నారు. రూరల్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు బాలాజీ, బూత్ స్థాయి బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

కోయిల్‌కొండ: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం అవుతుందని నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం సూరారం, వింజామూర్ తదితర గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు పార్టీలో చేరిన సందర్భంగా మాట్లాడారు. జిల్లా కుర్వ సంఘం అధ్యక్షుడు భీమయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు హనుమంతుయాదవ్, చెన్నప్పయాదవ్, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రంలో శనివారం గ్రామ చెరువులో పనిచేస్తున్న ఉపాధి కూలీల దగ్గరకు వెళ్లి కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కోఆప్షన్ మెంబర్ మహిమూద్, యూత్ అధ్యక్షుడు ఎస్ వెంకటేష్, శేఖర్ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో కుంభం శివకుమార్‌రెడ్డి

గండేడ్: కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన సాధ్యమని పీసీసీ మెంబర్ నరసింహరావు, మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం చిన్నవార్వాల్ అంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. రుసుంపల్లి, పెద్దవార్వాల్ తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు అనంతలక్ష్మారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ బాలయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ చిన్నయ్య పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి సతీమణి అక్షేషారెడ్డి జిల్లా కేంద్రంలోని 34వ వార్డు, టీచర్స్‌కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో అక్షేషారెడ్డి ప్రచారం

బాలానగర్: చిన్నరేవల్లికి చెందిన ఓయూ జేఏసీ నాయకుడు కొండకళ్ల పాండు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా 29న నిర్వహించే కురుమల ఆత్మీయ సమ్మేళనానికి ఆయనను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు.

స్నేహితుడి కుమార్తె వివాహానికి సాయం



నగదు అందజేస్తున్న మైనోద్దీన్ స్నేహితులు

ధన్వాడ: మండలంలోని హన్మాన్‌పల్లికి చెందిన మైనొద్దీన్ మూడో కుమార్తె వివాహానికి ఆయనతో పాటు పదోతరగతి చదివిన మిత్రులు చేయూతనందించారు. ఈ మేరకు రూ.15 వేల ఆర్థికసాయాన్ని శనివారం మైనోద్దీన్ భార్యకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ స్నేహితుడు మైనొద్దీన్ లేని లోటును ఎవరూ తీర్చలేరని అన్నారు. కార్యక్రమంలో ఇంజమూరు మాజీ సర్పంచ్ డి.రాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నాగిరెడ్డి, వెంకటయ్య, ధారాసింగ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రాజ్యాధికారం చేజిక్కించుకోవాలి

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్రంలో స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావంతో కూడిన బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా పులే- అంబేడ్కర్ జాతర శనివారం రాత్రి అట్టహాసంగా ప్రారంభమైంది. స్థానిక అంబేడ్కర్ కళాభవన్‌లో మహాత్మాగాంధీ యూనివర్సిటీ ప్రొఫెసర్ మద్దిలేటి, ఆయా వర్గాలలోని ప్రముఖులు ఈ కార్యక్రమానికి విచ్చేసి జాతరను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల గడిచినా.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు గడిచినా.. దేశంలో, రాష్ట్రంలో మనువాదమే రాజ్యమేలుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మహనీయులైన మహాత్మా జ్యోతిరావు పులే, బాబా సాహెబ్ అంబేడ్కర్, రామస్వామి, నారాయణ గురుల ఆలోచనలు, విధానాలకు వ్యతిరేకంగా మనువాదులు అధికారంలో ఉండి ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అణగదొక్కుతున్నారని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితి పోవాలంటే రాజ్యాధికారం చేజిక్కించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. జాతర వ్యవస్థాపక అధ్యక్షుడు బోయపల్లి నర్సిములు, నిర్వహణ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు సామేల్, టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు, విజయ్‌కుమార్, రవికుమార్, జాన్సన్‌బాబు, రఘునాథ్, యాదయ్య, సాజిదా సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రారంలో ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి



బొడ్రాయికి నీళ్లు పోస్తున్న రుద్రారం మహిళలు

నవాబుపేట: ఆధ్యాత్మికత మానవుల ఆయుష్షు పెరుగుతుందని... ప్రతివ్యక్తి భక్తిభావం అలవర్చుకోవాలని ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం రుద్రారంలో బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో బోనాలతో ఊరేగింపు వైభవంగా జరిగింది. దీంతో జనసంద్రంగా మారి పెద్ద జాతరను తలపించింది. గ్రామానికి వచ్చిన ఆడపడుచులకు కొత్త దుస్తులు పెట్టి వాయినాలు అందించారు. కార్యక్రమాల్లో రైతుబంధు మాజీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు లలితమ్మ, లక్ష్మమ్మ, కృష్ణరెడ్డి, కృష్ణగౌడ్, వివిధ పార్టీల నాయకులు రాజశేఖర్‌రెడ్డి, ధామోదర్‌రెడ్డి, నర్సిరెడ్డి, రాజు, వెంకట్‌రెడ్డి, యాదయ్య, వెంకటేష్, సత్యం, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న రూరల్ సీఐ నాగార్జునగౌడ్

రాజాపూర్: ప్రమాదాల నివారణ కోసం ప్రతిఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని.. వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలని జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్ సూచించారు. శనివారం రాజాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఆమ్నిల్ పరిశ్రమ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకోసం ఆరు స్టాపర్స్‌ను తయారు చేయించి అందించిన నేపథ్యంలో వారిని అభినందించారు. ఎస్ఐ రవి, ఎస్వీ ట్రావెల్స్ ఎండీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆమ్నిల్ సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు అమలవుతున్నాయి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అన్ని అమలు అవుతున్నాయని.. పార్లమెంట్ ఎన్నికల్లో చల్లా వంశన్నను గెలిపిస్తే మరింత అభివృద్ధి ఖాయమని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. శనివారం అగ్రహారం పొట్లపల్లి, కల్లేపల్లి, బీబీనగర్, ఈద్గాన్‌పల్లి, మల్లేపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇచ్చిన మాటప్రకారం కల్లేపల్లిలో కోతుల సమస్య పరిష్కారానికి కృషిచేశామన్నారు. అదేవిధంగా రంగారెడ్డిగూడ వద్ద జాతీయ రహదారి నుంచి కల్లేపల్లి, ఈద్గాన్‌పల్లి, మల్లేపల్లి నుంచి రాజాపూర్ మండల కేంద్రం వరకు డబుల్‌రోడ్డుకు నిధులు మంజూరు చేయించామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పనులు మొదలవుతాయని అన్నారు. నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, యాదగిరిగౌడ్, భరత్‌కుమార్‌రెడ్డి, యాదయ్య, శ్రీశైలంయాదవ్, శేఖర్‌గౌడ్, గడ్డంగోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ



కావేరమ్మపేట సంతలో మెప్మా, మున్సిపల్ సిబ్బంది మానవహారం

జడ్చర్ల టౌన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు వినియోగంపై శనివారం మున్సిపల్, మెప్మా సిబ్బంది పట్టణంలో స్వీప్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ఫ్లైఓవర్ వరకు కార్యక్రమం కొనసాగింది. అదేవిధంగా కావేరమ్మపేట సంత బజారులో మానవహారం నిర్వహించారు. ఓటుహక్కు బాధ్యత అని ప్రజలకు అవగాహన కల్పించారు. కళాజాతా సభ్యులు ఆకర్షణీయమైన పాటలతో ఓటు గురించి వివరించారు. స్వీప్ నోడల్ అధికారి డా. శ్రీధర్‌సుమన్, కమిషనర్ రాజయ్య మాట్లాడుతూ మే 13న ఎన్నికల్లో తప్పనిసరిగా ప్రతి ఒక్కరు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. 18ఏళ్లు నిండి ఓటు హక్కు కలిగిన వారు తమ ఓటు వేయటంతోపాటు కుటుంబ సభ్యులు, బంధువులతో సైతం ఓట్లు వేయించాలని సూచించారు. మున్సిపల్ మేనేజర్ నరేష్, మెప్మా క్లస్టర్ రీసోర్స్ పర్సన్ సునీత, లక్ష్మి పాల్గొన్నారు.

పోలింగ్ స్లిప్‌లు పంపిణీ చేయాలి



రుసుంపల్లిలో స్లిప్‌లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

గండేడ్: ఓటర్లందరికి పోలింగ్ స్లిప్‌లు పంపిణీ చేయాలని తహసీల్దార్ నాగలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ కిశోర్ సూచించారు. శనివారం కొండాపూర్, రుసుంపల్లి, మన్సూర్‌పల్లి తదితర గ్రామాల్లో పోలింగ్ స్లిప్‌లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో క్రమం తప్పకుండా ఓటర్లకు అందజేయాలన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి అడ్రస్‌ల వారీగా అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ చైతన్య, ఆర్ఐ ఫయాజ్ పాల్గొన్నారు.

ఆగస్టు 15 నాటికి రుణమాఫీ అమలు చేస్తాం



గుడిబండలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే జీఎంఆర్

అడ్డాకుల: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తోందని, ఆగస్టు 15 నాటికి రైతుల రుణమాఫీని అమలు చేసి తీరుతామని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. మండలంలోని వర్నె, ముత్యాలంపల్లి, పొన్నకల్, గుడిబండ, కాటవరం, తిమ్మాయిపల్లి తండా, కందూర్ గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రాన్ని పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ పార్టీలు పాలమూరు జిల్లాకు అన్యాయం చేశాయన్నారు. ఎంపీ అభ్యర్థిననే భావనతో పని చేయాలని కోరారు. ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి హస్తం గుర్తుకు ఓట్లేసి గెలిపించాలనే ప్రచారాన్ని ముమ్మరం చేయాలని కోరారు. ప్రతిపక్షాలు ఒక్కటై చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టి కాంగ్రెస్‌ను గెలిపించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. ఆయా గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు శ్రీహరి, ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాధిక, జగదీశ్వర్, నాగిరెడ్డి, విజయమోహన్‌రెడ్డి, లింగారెడ్డి, హేమవర్ధన్‌రెడ్డి, ధర్మారెడ్డి, శకుంతల, ప్రతాప్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు. ఇప్పుడు పాలమూరు ముద్దుబిడ్డ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినందున మన జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తారని చెప్పారు. పాలమూరు ఎంపీగా వంశీని గెలిపించుకుని సీఎంకు బహుమతిగా ఇద్దామని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే పాలమూరు జిల్లాలను అభివృద్ధిలో నంబర్ వన్‌గా చేస్తానన్నారు. గ్రామాల్లో ప్రతి కార్యకర్త, నాయకుడు తానే